రాడార్‌తో వినాశనమే!

- మా పాలనలో అందుకే రానియ్యలే
- కాంగ్రెస్ వచ్చిన 10 రోజుల్లో ఆగం
- 12 లక్షల చెట్లు కొట్టేందుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది
- రాడార్ వ్యతిరేక పోరాటానికి అండగా బీఆర్ఎస్ పార్టీ : కేటీఆర్

వికారాబాద్, జనవరి 29, (నమస్తే తెలంగాణ): రాడార్ కేంద్రంతో పర్యావరణం, పక్షులు, జీవవైవిధ్యం దెబ్బతింటుందని, పరిగికి, వికారాబాద్ జిల్లాకు నష్టం అయితదనే పదేండ్లు రాడార్‌ను రానివ్వలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సోమవారం పరిగిలోని ఎస్ గార్డెన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో దామగుండం అడవి పరిరక్షణ సమితి సభ్యులు వెంకటయ్య, రాములు కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'అడవి పోతది, చెట్లు పోతయి, పర్యావరణం పోతది, మీదికెళ్లి రేడియేషన్ సమస్య వస్తది తప్ప, రాడార్ కేంద్రంతో లాభం లేదు, ఈ విషయం తెలుసుకాబట్టే మన ప్రభుత్వం ఉన్నప్పుడు రానివ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన పది రోజుల్లోనే ఆగమాగంగా 12 లక్షల చెట్లను కొట్టేసే ప్రాజెక్టుకు జెండా ఊపింది' అని తెలిపారు. ఇంత జరుగుతున్నా పర్యావరణవేత్తలు, ప్రశ్నించే గొంతుకలు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. ఆనాడు రంజిత్‌రెడ్డి చొరవతో చేవెళ్ల నుంచి ఇక్కడికి జాతీయ రహదారిని విస్తరిద్దామంటే పెద్ద పెద్ద మర్రి చెట్లు పోతున్నాయని కొంతమంది కోర్టుకు పోయి చాలా రోజులు ఆపారని, వందల చెట్లు పోతుంటేనే ఆగం చేస్తే, మరి 12 లక్షల చెట్లు పోతుంటే ప్రశ్నించే గొంతులు ఎక్కడ? అని నిలదీశారు. అద్భుతమైన ప్రాంతం వికారాబాద్ జిల్లా అని, ఇక్కడి నుంచే మూసీ బయలుదేరుతదని తెలిపారు. రాడార్ కేంద్రంతో వెలువడే రేడియేషన్‌తో మొత్తం పర్యావరణం దెబ్బతింటే, అడువులన్నీ పోతే రేపు వరి సాగు అవుతుందా? మూసీకి నీటి చుక్క వస్తదా? ఈ ప్రాంతంలో వ్యవసాయానికి మనుగడ ఉంటదా? అని అడిగారు. ఇవన్నీ ఈ ప్రభుత్వానికి తెలిసి ఒప్పుకున్నారా? తెలియక ఒప్పుకున్నారా? అని ప్రశ్నించారు. పదేండ్ల క్రితం చేసిన ప్రజాభిప్రాయ సేకరణ ఇప్పుడెలా కరెక్టు? అని నిలదీశారు. 12 లక్షల చెట్లు ఎందుకు కొట్టేస్తున్నారో పరిగిలో బహిరంగ సభ పెట్టి చెప్పండి, 3 వేల ఎకరాల అటవీ భూములు తీసుకోవటంతో ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చే ఉద్యోగాలెన్నో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాడార్ కేంద్రాన్ని తీసుకొస్తామంటే ప్రధాన ప్రతిపక్షంగా చూస్తూ ఊరుకోబోమని, రాడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారికి అండగా ఉంటామని హామీనిచ్చారు. తాము అధికారంలో ఉన్నపుడు పర్యావరణ హిత పరిశ్రమలనే తీసుకొచ్చామని, ఎక్కడా పర్యావరణానికి హాని చేయలేదని పేర్కొన్నారు.

సోమవారం పరిగి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు

వంద స్పీడుతో దూసుకొస్తాం

సర్వీసింగ్ తర్వాత కారుది మళ్లీ రాకెట్ వేగం • 24 ఏండ్లు 100 స్పీడుతో పార్టీని నడిపినం: కేటీఆర్

- 1న ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణం
- తెలంగాణ కోసం కొట్లాడేది బీఆర్ఎస్సే
- దూడూ బసవన్నలతో లాభం లేదు
- హామీలు నెరవేర్చకుంటే నిలదీస్తం
- రాష్ట్ర ప్రభుత్వ తీరుతో రోడ్డున పడ్డ 6.5 లక్షల ఆటోడ్రైవర్ల కుటుంబాలు
- కాంగ్రెస్ ప్రతి రక్తపు బొట్టులో మోసమే
- 'అయోధ్య రామమందిరం'తో బీజేపీ ఓటు రాజకీయం చేస్తున్నది
- చేవెళ్ల, పరిగి నియోజకవర్గాల కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

వికారాబాద్/రంగారెడ్డి, జనవరి 29 (నమస్తే తెలంగాణ): 'కారు వంద స్పీడుతో మళ్లీ దూసుకొస్తుంది. కేసీఆర్ 2001లో పార్టీ పెట్టి 14 ఏండ్ల పాటు ఉద్యమాన్ని 100 కిలోమీటర్ల స్పీడుతో నడిపారు. 2014లో అధికారం చేపట్టి పదేండ్ల పాటు 100 కిలోమీటర్ల స్పీడుతో పోనిచ్చారు. 24 ఏండ్ల పాటు పార్టీని రయ్‌మని ఉరికించారు. సర్వీసింగ్ తర్వాత అంతే వేగంతో దూసుకొస్తాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. 119 సీట్లలో 39 సీట్లు సాధించి బలమైన ప్రతిపక్షంగా ఉన్నామని చెప్పారు. సోమవారం చేవెళ్ల, పరిగి అసెంబ్లీ నియోజకవర్గాల విస్తృత స్థాయి సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ కోసం కొట్లాడేది, పార్లమెంట్‌లో గళం విప్పేది బీఆర్ఎస్ పార్టీనేనని స్పష్టం చేశారు. దూడూబసవన్నలను పార్లమెంట్‌కు పంపితే తెలంగాణకు ఎలాంటి లాభం ఉండదని తెలిపారు.

ప్రజలు బాధపడుతున్నరు

కాంగ్రెస్ గెలిచిన తెల్లారి నుంచి ప్రజలు బాధపడుతున్నారని, దొంగమాటలు నమ్మి కేసీఆర్‌ను పొగొట్టుకున్నామని చెప్తున్నారని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుతం వచ్చిన మార్పు ఏమిటని అడిగితే, పొద్దున పదింటికి పోయి సాయంత్రం 5 గంటలకు కరెంట్ వచ్చిందని కృష్ణారెడ్డి అనే తమ్ముడు చెప్పాడని తెలిపారు. పదేండ్లలో మొదటిసారి మోటర్ కాలిపోయిందని సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మీటింగ్‌లో ఓ తమ్ముడు చెప్పినట్టు వివరించారు. కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదన్న కేసీఆర్ మాటలను కాంగ్రెస్ సర్కార్ నిజం చేస్తున్నదని, మార్పు కావాలని అన్నోళ్లు, ఇప్పుడు నెత్తినోరు కొట్టుకుంటున్నారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆరున్నర లక్షలమంది ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు.

కమాండర్ కేసీఆర్ వస్తున్నరు

> ఫిబ్రవరి 1న కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తారు. బడ్జెట్ సెషన్‌కు కూడా హాజరవుతారు. బీఆర్ఎస్ అభ్యర్థుల తరఫున పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేస్తారు. కేసీఆర్ వచ్చే నాటికి కాంగ్రెస్ వంద రోజుల గడువు కూడా పూర్తవుతుంది. అసెంబ్లీలో కేసీఆర్ సైనికులు మాట్లాడితేనే కాంగ్రెసోళ్లు తట్టుకోలేకపోయారు. ఇక కమాండర్ కేసీఆర్ వస్తే ఎట్లుంటదో ఆలోచించండి. - కేటీఆర్

హామీలపై బరాబర్ నిలదీస్తం

అబద్ధాలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి అక్కడ కూడా పచ్చి అబద్ధాలు మాట్లాడారని కేటీఆర్ విమర్శించారు. రేవంత్‌రెడ్డి చెప్పిన రూ.2 లక్షల రుణమాఫీ, కల్యాణమస్తు కింద ఇస్తామన్న రూ.లక్ష, తులం బంగారం ఎక్కడ? అని కాంగ్రెస్ సర్కారును సూటిగా ప్రశ్నించారు. ఆ పార్టీ ఇచ్చింది 6 గ్యారెంటీలు కాదని, 420 హామీలు అని వెల్లడించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే బరాబర్ నిలదీస్తామని స్పష్టం చేశారు. లంకె బిందెలు ఉన్నాయని వస్తే, ఖాళీ బిందెలు కనిపిస్తున్నాయన్న రేవంత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. కనీసం మంత్రిగా పనిచేయనోడిని సీఎంని చేస్తే ఇట్లనే ఉంటుందని ఎద్దేవా చేశారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామన్న కాంగ్రెస్ పార్టీకి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వేటు వేసి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 'కేసీఆర్ రూ.లక్ష రుణమాఫీ చేసిండు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నేను మొదటి సంతకం రూ.2 లక్షల రుణమాఫీ మీద చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పిండు. డిసెంబర్ 9 పోయింది, జనవరి 9 పోయింది, ఫిబ్రవరి 9 వస్తున్నది. చిల్లర నాణేల కోసం వంద నోటును పొగొట్టుకున్నామని ప్రజలు బాధ పడుతున్నారు' అని వివరించారు. కాంగ్రెస్ ప్రతి రక్తపు బొట్టులో మోసమే ఉన్నదని మండిపడ్డారు. అటు రామమందిరం పేరు చెప్పుకొని ఓట్లు దండుకోవాలని బీజేపీ చూస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యాదగిరిగుట్ట ఆలయాన్ని నిర్మించిందని, ఏనాడూ ఆలయం పేరు చెప్పి లబ్ధి పొందే ప్రయత్నం చేయలేదని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం ఉన్నదని విమర్శించారు.

కేసీఆర్ ప్రభుత్వంలో సీజన్‌కు ముందే రైతుబంధు

కేసీఆర్ ప్రభుత్వంలో సీజన్‌కు ముందే వారం రోజుల్లో రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేవని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రణాళిక, పద్ధతి, వ్యూహంతో రూ.7,500 కోట్లను నాట్లు వేసే సమయానికి కమిట్‌మెంటుతో అందజేశారని వెల్లడించారు. ఇక, గత పదేండ్లలో పార్టీ, కార్యకర్తల మధ్య సమన్వయం లోపించింది వాస్తవమేనని కేటీఆర్ తెలిపారు. ఇక ముందు అలా జరగకుండా చూస్తామని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. వ్యక్తిగత విభేదాలు పక్కనబెట్టి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వరుసగా ఎన్నికలు ఉన్నందున ఇప్పుడే గట్టిగా పునాది వేసుకోవాలని సూచించారు. పరిగిలో వంద కిలోమీటర్ల స్పీడ్ కారు గుర్తు మీద నొక్కితే ఎంపీగా మళ్లీ రంజిత్‌రెడ్డి గెలవాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, ఆనంద్, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, షాబాద్ జడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ జుక్కల్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి. చిత్రంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తదితరులు

గ్యారెంటీలు అమలయ్యేదాకా వెంటాడుతాం

- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు దిమ్మ తిరగాలి
- 17 చోట్ల గులాబీ జెండా ఎగరాలి
- జుక్కల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం

పిట్లం, జనవరి 29: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను అమలు చేసేదాకా ఆ పార్టీని వదిలిపెట్టకుండా వెంటాడుతామని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు దిమ్మతిరిగేలా రాష్ట్రంలోని 17 స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ జుక్కల్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారాలు, అలవికాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి గెలిచిందని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకాన్ని మాత్రమే అమలు చేసి, మిగిలిన వాటిని అమలు చేయడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు అమలు చేయాలంటే ఏటా రూ.4 లక్షల కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు. ఇదేదీ ఆలోచించకుండా అలవికాని హామీల పేరిట ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్తూ బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేసీఆర్ అధికారంలో ఉంటే యాసంగి పెట్టుబడి సాయం ఇప్పటికే రైతులు అందరికీ అందించే వారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరెంట్ కోతలు, సాగునీటి కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. సమావేశంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలతో కాంగ్రెస్ మోసం

- వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఫైర్
- హామీలు అమలుచేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం: ఎర్రబెల్లి
- ప్రజల పక్షాన నిలబడుతాం: మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్

వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ తదితరులు

న్యూశాయంపేట, జనవరి 29: కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. హనుమకొండలో సోమవారం మాజీ ఎమ్మెల్యే, వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో మరింత పట్టుదలగా పని చేసి ఉంటే మళ్లీ గెలిచేవారమని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను కచ్చితంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటమిపై సమీక్షించుకుని రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మతాలపేరుతో రాజకీయాలు చేసే ప్రధాని మోదీకి మూడోసారి ప్రజలు ఎందుకు ఓట్లు వేయాలని, అక్షింతల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

రైతుబంధు ఏదీ?: ఎర్రబెల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9న రైతుబంధు ఇస్తామని చెప్పినా ఇంకా ఇవ్వలేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో చిన్నచిన్న కారణాలతో ఓడిపోయామని, కార్యకర్తల సూచనలను పరిగణనలోకి తీసుకొని పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. అరూరి రమేశ్ మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా, లేకున్నా తాము ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తామని, పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేస్తామని పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో వారిని అరూరి రమేశ్ చేతులమీదుగా సన్మానించారు. సమావేశంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జిల్లా రైతుబంధు కోఆర్డినేటర్ లలితా యాదవ్, జెడ్పీ వైస్‌చైర్మన్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా అందోల్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ తదితరులు

హామీలు అమలు చేయకపోతే ప్రతిఘటిస్తాం

- సీఎం హుందాగా వ్యవహరించాలి
- ఆయన తీరును ప్రజలు సహించరు
- కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి
- బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు గెలిస్తేనే తెలంగాణ రాష్ట్రానికి న్యాయం
- అందోల్‌లో నియోజకవర్గ సమీక్షలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి

సంగారెడ్డి జనవరి 29(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ప్రతిఘటన తప్పదని మాజీ స్పీకర్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మధుసూదనాచారి హెచ్చరించారు. సీఎం హోదాకు తగ్గట్టుగా రేవంత్‌రెడ్డి వ్యవహరించడం లేదని, ఆయన తీరును ప్రజలు సహించడం లేదని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అందోల్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని, ఆయన తన తీరు మార్చుకోకపోతే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఎన్నికల హామీలు నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. విచారణల పేరుతో కొండను తవ్వి ఎలుకలను పట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఎన్ని విచారణలకైనా తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ చేశారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ఏనాడూ కరెంటు కోతలు, సాగునీటి ఇబ్బందులు లేవని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటేలా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ప్రాతినిధ్యంతోనే తెలంగాణకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఎన్నడూ తెలంగాణ సమస్యలను పార్లమెంటులో లేవనెత్తలేదని విమర్శించారు. ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. అందోల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుకోసం పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం, తప్పుడు హామీల కారణంగా అందోల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయిందని చంటి క్రాంతికిరణ్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం లోపించిందని, దీనిని అధిగమించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, మఠం భిక్షపతి, బాలయ్య, రాహుల్‌కిరణ్, ఉదయ్‌బాబూమోహన్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

50 రోజుల్లోనే 14 వేల కోట్ల అప్పు

- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానివి ఆచరణ సాధ్యంకాని హామీలు
- పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర గళం వినిపించేది బీఆర్ఎస్ పార్టీనే
- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెల్సీ ఎల్ రమణ

బంజారాహిల్స్, జనవరి 29: గత ప్రభుత్వం అప్పులు చేసిందని మాట్లాడిన వారు.. అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లోనే రూ.14 వేల కోట్లు అప్పుగా చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గురించి ఎందుకు మాట్లాడటం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నేత, ఎమ్మెల్సీ ఎల్ రమణ ప్రశ్నించారు. బంజారాహిల్స్‌లో సోమవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ.. పిడికెడు మందితో ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమాన్ని ప్రారంభించిన కేసీఆర్.. రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా తెలంగాణను అభివృద్ధిలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిపారని కొనియాడారు. అబద్ధపు మాటలు, ఆచరణ సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక నోటికి వచ్చిన మాటలు మాట్లాడుతుందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన యాభై రోజుల్లోనే రూ.14 వేల కోట్ల అప్పులు చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించేది ఒక్క బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. గత పదేండ్లలో పార్లమెంట్‌లో 2,200 ప్రశ్నలు అడిగిన ఘనత బీఆర్ఎస్ ఎంపీలకే దక్కుతుందని స్పష్టంచేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ సీటును ఈసారి కచ్చితంగా బీఆర్ఎస్ గెలుచుకొంటుందని, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి, అర్షద్ నవాబ్, కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, మహాలక్ష్మీగౌడ్, వనం సంగీతాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్ తదితరులు

వరంగల్ జిల్లా నర్సంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎంపీ సీతారాంనాయక్ తదితరులు

కాంగ్రెస్‌కు ప్రతిపక్షం రుచి చూపిస్తాం

- ప్రజలకు అందుబాటులో ఉంటాం
- మంజూరైన నిధుల్లో రూపాయి లాప్స్ అయినా ఊరుకోబోం
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- మళ్లీ గెలిచేది బీఆర్ఎస్ పార్టీయే: ఎంపీ మాలోత్ కవిత స్పష్టీకరణ
- నర్సంపేటలో బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

నర్సంపేట, జనవరి 29: వంద రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రతిపక్షం అంటే ఎలా ఉంటుందో రుచి చూపిస్తామని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. ఇప్పటివరకు రెండెకరాలకు పైన ఉన్న రైతులకు రైతుబంధు, పాకాలకు గోదావరి నీళ్లు ఇచ్చిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. ఆరు నెలల నుంచి తాను నర్సంపేట అభివృద్ధికి తెచ్చిన జీవోలను ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆపివేయించారని మండిపడ్డారు. మంజూరైన నిధుల్లో ఏ ఒక్క రూపాయి ల్యాప్స్ అయినా ఊరుకోబోమని హెచ్చరించారు. మూడు రోజుల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నామని, ఇప్పుడు కూడా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం 24 గంటలు తెరిచే ఉంటుందని చెప్పారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ నిలబెట్టే అభ్యర్థిని గెలిపించాలని కోరారు. మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో మహబూబాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా తానే పోటీచేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటమితో నిరాశ చెందవద్దని, మళ్లీ గెలిచేది బీఆర్ఎస్సేనని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామినాయక్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో జనగణన చేపట్టాలి

జనగణన వేదిక జాతీయ అధ్యక్షుడు గోసుల శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జనగణన చేపడతామనే రాజకీయ ప్రకటనలు రావడం పరిపాటిగా మారిందని, రాష్ట్ర ప్రభుత్వం అలాకాకుండా తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని జనగణన వేదిక జాతీయ అధ్యక్షుడు గోసుల శ్రీనివాస్‌యాదవ్ డిమా